వంతెన నిర్మించేదెప్పుడో?



చెన్నిపాడు- బొంకూరు మధ్య నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న గ్రామస్తులు

- ఏళ్లు గడుస్తున్నా.. తప్పని తిప్పలు
- ప్రతిపాదనలకు పరిమితం
- గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు

మానవపాడు: మండలంలోని రైతులు, ప్రయాణికులు, వాహనాదారులు వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి. పల్లె పల్లెకు అనుసంధానంగా ఉండే గ్రామీణ రోడ్ల వెంట వాగులు, వంకలపై వంతెనలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గ్రామాల మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల మధ్య వున్న ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన బీటీ రోడ్ల మధ్య ఉన్న వాగులపై వంతెనలు లేవు. రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు కాడెద్దుల బండ్లతో రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. వాగుల వద్ద పలు సందర్భాల్లో ఎద్దుల బండ్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. కల్వర్టులు లేని వాగుల వద్ద వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. ప్రజాప్రతినిధులను నిలదీసినప్పుడు మాత్రమే కంటితుడుపు చర్యగా అధికారులకు ఆదేశాల జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ తంతు కొన్నేళ్లుగా కొనసాగుతుందని ప్రజలు వాపోతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా..

అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో కలిపి 124 గ్రామాలు ఉన్నాయి. మానవపాడు మండలంలోని మానవపాడు-అమరవాయి, చెన్నిపాడు-మానవపాడు, అమరవాయి-కలుకుంట్ల, చెన్నిపాడు-పెద్దపోతులపాడు వంతెనలు, ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడు-కారుపాకుల, సాసనూలు-శేక్‌పల్లి, శేక్‌పల్లి-ఎర్రవల్లి, ఇటిక్యాల-ఉదండాపురం, గ్రామాలలో వంతెనలు, ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల-పుల్లూరు, ఉండవెల్లి-చిన్నఆముదాలపాడు, కంచుపాడు-చిన్నఆముదాలపాడు, వడ్డేపల్లి మండలంలో జూలకల్లు- జూలకల్లుస్టేజి, రామాపురం-వల్లూరు, కొంకల-వడ్డేపల్లి, రాజోళి మండలంలో రాజోళి-ముండ్లదిన్నె, తుమ్మిళ్ల-మాన్‌దొడ్డి, అయిజ మండలంలో అయిజ-పర్దిపురం, చిన్నతాండ్రాపాడు-అయిజ, అలంపూర్ మండలంలో అలంపూర్-గొందిమళ్ల గ్రామాల రోడ్లపై వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

రాకపోకలకు ఇబ్బందులు



మండలంలోని అమరవాయి- మానవపాడు రెండు గ్రామాల వాగుల మధ్య వంతెన నిర్మించాలి. వర్షం వస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయి. కలుకుంట్ల, మద్దూరు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్ వెళ్లేందుకు వాగు పారితే అంతరాయం తప్పదు. అధికారులు, పాలకులు చొరవ చూపి వంతెన నిర్మించాలి.

– పోషిరెడ్డి, మానవపాడు

ప్రతిపాదనలు పంపించాం

అలంపూర్ నియోజకవర్గంలోని మండలాల్లో వంతెనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. ఉన్నతాధికారులకు సైతం వాటిని నివేదించాం. వంతెనలకు నిధులు మంజూరైతే వెంటనే నిర్మాణాలు చేపడతాం.

– మహేష్, ఆర్‌అండ్‌బీ, అలంపూర్ ఇన్‌చార్జ్

అంతర్రాష్ట్ర స్థాయి బల ప్రదర్శన పోటీలు

అయిజ: పట్టణంలో తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయ ప్రాంగణంలో అంతర్రాష్ట్ర స్థాయి యువకుల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లాకు చెందిన యువకులు పైచేయి సాధించారు. దొబ్బుడు గుండు పోటీల్లో 160 కేజీల బరువును ఎత్తి జోగుళాంబ గద్వాల జిల్లా వెంకటాపురం చెందిన లాల్‌బాషా ప్రథమ బహుమతి రూ.5,016, రాయచూరు జిల్లాకు చెందిన కృష్ణ ద్వితీయ బహుమతి రూ.3,016 గెలుపొందాడు. 180 కేజీల ఇసుక సంచి ఎత్తు పోటీల్లో రాయచూరు జిల్లా దేవదుర్గకు చెందిన పరశురామ్ ప్రథమ బహుమతి రూ.5,016, ద్వితీయ బహుమతి రూ. 3,016ను ఆదేజిల్లాకు చెందిన శంకరప్ప నాయక్ కైవసం చేసుకున్నారు. 93 కేజీల సందెపు రాళ్ల ఎత్తు పోటీల్లో రాయచూర్ జిల్లా ఇబ్రహీందొడ్డికి చెందిన వెంకటేష్ ప్రథమ బహుమతి రూ.5,016, గుడబల్లూరుకు చెందిన సూరి ద్వితీయ బహుమతి రూ. 3,016ను కైవసం చేసుకున్నాడు.

కేంద్ర మంత్రికి ఘనస్వాగతం



అలంపూర్: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో నిర్వహించే విద్యావంతుల సదస్సు, బడ్జెట్‌పై చర్చ కార్యక్రమానికి రోడ్డు మార్గం గుండా వెళ్తున్న కేంద్ర సమాచార సహాయక శాఖా మంత్రి దేవుసిన్హా చౌహాన్‌కు ఉండవెల్లి, అలంపూర్ మండల బీజేపీ నాయకులు శనివారం రాత్రి చౌరస్తాలో ఘనంగా స్వాగతం పలికారు. కర్నూల్‌లో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉండవెల్లి మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పాల్వాయి వెంకటేష్‌గౌడ్, రాజశేఖర్, నాగమద్దిలేటి, జగన్‌మోహన్‌రెడ్డి, ఈశ్వర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల క్యూ..

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు స్వామి వారి ప్రాసస్త్యాన్ని వివరించారు. ఆలయానికి సమీపంలో ఉన్న కృష్ణానదిలో పవిత్ర స్నానాలను ఆచరించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆదిశిలా క్షేత్రంలో..

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మధుసూదనాచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



కేటీదొడ్డి: పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎస్పీ సృజన ఆదేశించారు. శనివారం కేటీదొడ్డి పోలీసు స్టేషన్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, 5ఎస్‌పని తీరు, ఏ తరహ కేసులు ఎక్కువగా నమోదవుతాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే బాల్యవివాహాలు, మూఢ నమ్మకాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలని, విధిగా స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఎస్‌ఐ వెంకటేష్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలి



నాగర్‌దొడ్డిలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

మల్దకల్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని తాటికుంట, నాగర్‌దొడ్డి, సద్దలోనిపల్లి, అమరవాయిలో పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శంకర్, గౌస్, నారాయణరెడ్డి, ఇలియాస్, రాజేంద్ర, వెంకటేష్, శ్రీకాంత్‌గౌడ్, రవినాయుడు, మజీద్, కోటేష్‌గౌడ్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

శాట్స్ చైర్మన్ సోదరుడు మృతి



గట్టు: శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ సోదరుడు నర్సన్‌గౌడు(53) శనివారం మృతి చెందారు. మండలంలోని ఆలూరు చెందిన నర్సన్‌గౌడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఇటీవల హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

ప్రభుత్వం పేదలను గాలికొదిలేసింది



తూర్పుగార్లపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

రాజోళి: టీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తూర్పుగార్లపాడు, పడమటి గార్లపాడు, తుమ్మిళ్ల, పెద్ద తాండ్రపాడులో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికీ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తున్నాయని, మాయ మాటలు చెప్పి ప్రజలతో ఓట్లు వేయించుకుని, గద్దెనెక్కాక ప్రజా సమస్యలను గాలికొదిలేవారని ఆరోపించారు. నేటికి మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయని, బురద, మట్టి, గుంతలు రోడ్లపై దర్శనమిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, శాలు, రామకృష్ణారెడ్డి, చిన్నిబాబు, నాగశిరోమణి, కుమార్, సంధ్యాబాబు తదిదరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో తుమ్మిళ్ల లిఫ్ట్ పంపింగ్

శాంతినగర్: ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు అధైర్యపడవద్దని రెండు రోజుల్లో తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ పంపింగ్ ప్రారంభమవుతుందని వడ్డేపల్లి జెడ్పీటీసీ రాజు అన్నారు. జెడ్పీటీసీ కార్యాలయంలో ఎంపీపీ రజిత, జెడ్పీటీసీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే అబ్రహం సుంకేసుల బ్యారేజి, ఏపీ ఇరిగేషన్ ఎస్‌ఈ శేఖర్‌రెడ్డితో మాట్లాడారని, తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద తుంగభద్ర నదిలో నీటి నిల్వలు పెరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీంతో తుమ్మిళ్ల వద్ద బ్యాక్ వాటర్ పెరుగుతుందన్నారు. రెండు రోజుల్లో తుమ్మిళ్ల లిఫ్ట్ పనిచేస్తుందని, ఆయకట్టుకు నీరందించేందుకు ఎమ్మెల్యే చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. ఆయకట్టు రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. సమావేశంలో సర్పంచ్‌లు భూషణం, తిమ్మప్ప, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ మహేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, రామలింగం, శేఖర్, రవిగౌడ్, ముత్తురాజు, హంపిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజు

అలరించిన 'ఘంటసాల' గానలహరి



ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న గాయకులు

గద్వాల: ఘంటసాల పాడిన మధుర గీతాలు ఆహూతులను అలరించాయి. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి స్థానిక వేదనగర్‌లోని జిహ్వేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 'శతాబ్ది గాయకుడు ఘంటసాల' పేరుతో అలనాటి సినీ పాటల ఆర్కెస్ట్రా కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమానికి కళాభిమానులు, వ్యాపారులు, పట్టణ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'నా హృదయంలో నిదురించే చెలి..', 'ఈ మౌనం ఈ బిడియం..' గోరొంక గూటికే చేరావు చిలక..', 'నిలువవే వాలు కనులదానా..', చిటపట చినుకులు పడుతూ ఉంటే..'అంటూ ఔత్సాహిక గాయకులు ఆలపించిన పాటలు అలనాటి మధురస్మృతులను గుర్తుకు తెచ్చాయి. వీటితో పాటు పలు పాటలను పాడి ఆకట్టుకున్నారు. మరికొన్ని పాటలు సభికుల మన్ననలు పొందాయి.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ధరూరు: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానించడంపై మండల వాల్మీకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేష్, వెంకటేష్ నాయుడు, ప్రహ్లాద, ఆంజనేయులు, చంద్రమౌళి, వెంకటరమణ, ఈశ్వర్, నాగరాజు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న వాల్మీకులు

శివభక్తుల పాదయాత్ర

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట, వెంకటాపురం నుంచి శివ భక్తులు 41 రోజుల దీక్ష అనంతరం శనివారం పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. తెల్లవారుజామున స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు కట్టుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పురస్కరించుకుని శివమాలలు ధరించి పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటామన్నారు. దాదాపు 50 మంది శివమాలధారులను సాగనంపేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు తరలివచ్చారు.



పాగుంట నుంచి పాదయాత్రగా బయలుదేరుతున్న శివమాలధారులు

భక్తులకు అన్నదానం

మానవపాడు: మండలంలోని నారాయణపురం బాలయోగి శివనారాయణస్వామి ఆశ్రమంలో నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం కర్ణాటక నుంచి శ్రీశైలం వెళ్తున్న శివమాలధారులకు ఆశ్రమ సభ్యులు వీరారెడ్డి, రాఘవరెడ్డి, విశ్వనాథరెడ్డి, లింగేశ్వర్, శాంతకుమార్ తదితరులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వ్యవసాయానికి నియంతర విద్యుత్ ఏది?

గద్వాల అర్బన్: వ్యవసాయానికి నిరంతరంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌టీపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ అతి కూర్ రహ్మాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నది అగ్రహారం రోడ్డులోని సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రైతులందరికీ 24 గంటల పాటు విద్యుత్ అందడం లేదన్నారు. ప్ర స్తుతం కరెంట్ కోతలు విధిస్తున్నందున అసలు ఎప్పుడు వస్తుందో, పోతుందో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. పంటలకు నీరు కట్టుకోలేక రైతు లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్ అందించేవారన్నారు. ప్రస్తు తం బీఆర్‌ఎస్ పార్టీ హయంలో కరెంట్ కోతలతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రా బోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి రైతులే తగిన బుద్ధి చెప్తారన్నారు. వెంటనే రైతులకు 24గంటల పాటు కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశా రు. అనంతరం ఏడీఈ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనుస్, సురేష్, ప్రసాద్ రావు, నర్సన్న, ప్రభాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అతికూర్ రహ్మాన్

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అలంపూర్: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి బీఎస్పీ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. అలంపూర్‌చౌరస్తాలో నాయకులు ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కర్నూల్‌లో ఆటో డ్రైవర్లకు పార్కింగ్, ఆటోలు వెళ్లిన సమయాల్లో అడ్డగించడం చేస్తున్నట్లు డ్రైవర్లు తెలిపారు. దీంతో నాయకులు కర్నూల్‌కు వెళ్లి అక్కడి పోలీస్ అధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. కర్నూల్ నగరంలోని ఆటో డ్రైవర్లతో మాట్లాడి ఈ ప్రాంతానికి చెందిన డ్రైవర్లతో కలిసి ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల వారు రాకపోకలు సాగించడం సహజంగా ఉంటుందని, అలాంటి సమయాల్లో గొడవలు పడవద్దని అందరిని కూర్చోబెట్టి సామరస్యంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు.



అలంపూర్ చౌరస్తాలో డ్రైవర్లతో మాట్లాడుతున్న నాయకులు

గిరిజనులను అన్యాయం చేయొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన జేఏసీ నాయకులు

గద్వాల అర్బన్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనులకు అన్యాయం చేయొద్దని గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసినవారవుతారన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఏకగ్రీవ తీర్మానంపై పునరలోచించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నివసించే వారిని తెగలలో కలపడం ఎంత వరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో శ్రీను నాయక్, భాస్కర్ నాయక్, రాము నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,352

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శనివారం 577 క్వింటాళ్ల వేరుశనగ రాగ, గరిష్టం రూ.8352, కనిష్ఠం రూ. 3059, సరాసరి రూ. 6812 ధరలు లభించాయి. 16 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 6460, కనిష్ఠం రూ.6260, సరాసరి రూ. 6320 ధరలు పలికాయి. 5 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్ఠం రూ. 6806, కనిష్ఠం రూ. 6069, సరాసరి రూ. 6766 ధరలు వచ్చాయి. 4 క్వింటాళ్ళ వరి (సోన) రాగా, గరిష్ఠం, కనిష్ఠం, సరాసరిగా రూ. 1827 పలికింది.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

గద్వాల అర్బన్: ఎయిడ్స్ నిర్మూలనపై శనివారం హోప్ ఎన్‌జీఓ, రాష్ట ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ వద్ద కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఎయిడ్స్, హెచ్‌ఐవీ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సునీల్ చౌహాన్, శేఖర్, వెంకటేష్, పరశురాముడు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్‌ఐని కలిసిన నాయకులు



రాజోళి: మండల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన కుర్మయ్యను జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిసాక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో చేనేత కార్మికుల కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, వారు ఎక్కువగా వృత్తిలో నిమగ్నం అవుతారే తప్ప ఇతర ప్రపంచంతో సంబంధం ఉండదని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలు తమ దృష్టికి వస్తే వారికి అవగాహన కల్పించి, సమాజంలోని అంశాలపై చైతన్యం కలిగించేందుకు కృషి చేయాలని కోరారు. శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వీరేష్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని సోమవారం రైతువేదికలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ సయ్యద్‌ఖాన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ఉంటుందని సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని భారతీయ మజ్దూర్ సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. దీనిని నిరసిస్తూ 14న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఆరుగురికి జరిమానా

అలంపూర్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుపడిన ఆరుగురికి జడ్జి జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. మున్సిపాలిటీలో సాధారణ వాహన తనిఖీల్లో ఆరుగురిపై డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదైనట్లు తెలిపారు. వీరిని శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరిచారు. జడ్జి కమలాపురం కవిత ఒకొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా, వారిలో ఇద్దరికి జరిమానాతో పాటు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

15న మండల సర్వసభ్య సమావేశం

ధరూరు: మండల సర్వసభ్య సమావేశం 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ నజీమున్నీసా బేగం అధ్యక్షతన సమావేశం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

బాలసదనంకు కూలర్ల వితరణ

గద్వాల: బీజేపీ పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు జన్మదినోత్సవం సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడాకారులు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. బండల వెంకట్రాములు, కౌన్సిలర్ బండల పాండు బాలసదనం విద్యార్థులకు రెండు కూలర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు కూలర్లను వితరణ చేశామని కౌన్సిలర్ తెలిపారు.

పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



అయిజ: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పండిత్ దీన్ దయాళ్ తత్వవేత్త, గొప్ప రాజకీయవేత్త, మేధావి, భారత జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త అని కొనియాడారు. కార్యక్రమంలో తిరుమల్‌రెడ్డి, నాగరాజు, భీమసేనరావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

24గంటల త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలి

గద్వాల అర్బన్: జిల్లాలో 24గంటల పాటు త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయానికి మూడు, నాలుగు గంటల పాటు కరెంట్ సరఫరా చేస్తున్నారని, దీంతో పంటలు ఎండిపోయే ఆవకాశం ఉందన్నారు. వెంటనే 24గంటల పాటు కరెంట్ ఇవ్వాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.